సాక్షి
నంద్యాల
సోమవారం । 27 । జనవరి । 2025



శ్రీగిరి కిటకిట

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.



మహానందిలో భక్తుల సందడి

మహానంది: సెలవురోజు కావడంతో ఆదివారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. కోనేరుల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. ఆదివారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సహస్రనామ పూజలు చేపట్టారు.

న్యూస్‌రీల్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం

నంద్యాల: కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీ మఠంలో వైభవంగా ద్వాదశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో మూల బృందావనం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం ద్వాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మంత్రాలయంకు భక్తుల రద్దీ కొనసాగుతుంది. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజాము నుంచి పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, క్షీరాభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథోత్సవాలపై కొలువుంచి శ్రీ మఠం మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో శ్రీ మఠం పరిసరాలు రద్దీగా మారాయి.

రూ.35 కోట్లతో శ్రీశైలంలో సోలార్ పవర్ ప్లాంట్

- ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగంలో భాగంగా రూ.35 కోట్ల అంచనా వ్యయంతో 7 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం గణతంత్ర వేడుకల అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకు క్షేత్రాన్ని దర్శించే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, భక్తుల రద్దీకి అనుగుణంగా ఆయా సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేవస్థానం నిర్మించే 7 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా రోజుకు సుమారు 31 వేల యూనిట్లు దాకా విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందని, ఈ విద్యుదుత్పత్తి వలన సంవత్సరానికి రూ.7కోట్ల వరకు దేవస్థానానికి ఆదా అవుతుందన్నారు. మంచి నీటి సరఫరాలో భాగంగా మల్లమ్మ కన్నీరు, హటకేశ్వరం, ఫిల్టర్‌బెడ్ మొదలైన చోట్ల రూ.6.20 కోట్లతో మంచినీటి ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మవారి ఆలయంలో ఉత్తర సాలుమండపాలను రూ.99 లక్షలతో పునర్నిర్మించడం జరుగుతుందన్నారు. రూ.60 లక్షల వ్యయంతో దేవస్థానం ఆగమపాఠశాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గణేశసదనం ఎదురుగా మినీ కళ్యాణ మండపాన్ని నిర్మిస్తున్నామన్నారు. స్వర్ణరథాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా రథం షెడ్డును నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే దోర్నాలలో దేవస్థాన సత్రములో కల్యాణమండపాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.

కర్నూలు విద్యుత్ సర్కిల్‌కు ఉత్తమ అవార్డు

కర్నూలు న్యూసిటీ: కర్నూలు విద్యుత్ సర్కిల్‌కు ఉత్తమ అవార్డు దక్కింది. ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని మొత్తం 9 సర్కిళ్లలో కర్నూలు అన్ని పారామీటర్లలో మొదటి స్థానంలో నిలవడంతో ఉత్తమ సర్కిల్‌గా ఎంపికైంది. ఈ మేరకు తిరుపతిలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల సందర్భంగా సీఎండీ చేతు ల మీదుగా కర్నూలు ఎస్ఈ ఉమాపతి మెమొంటో అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ... తమ సర్కిల్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో ఈ అవార్డు దక్కిందన్నారు.



సీఎండీ చేతుల మీదుగా మెమొంటో అందుకుంటున్న ఎస్ఈ ఉమాపతి

పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



జిల్లా అభివృద్ధికి పునరంకితమవుదాం

- ఉన్నత జీవన ప్రమాణాలే లక్ష్యం
- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ రాజకుమారి
- ఉత్తమ అధికారులకు అవార్డుల ప్రదానం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్



మాట్లాడుతున్న నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: స్వేచ్ఛ, సమానత్వం, లౌకికత్వం, న్యాయాలను ప్రజలంతా పూర్తిస్థాయిలో అనుభవిస్తున్నారని, జిల్లా అభివృద్ధికి అందరూ పునరంకితం కావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరేడ్ మైదానంలో భారత గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.జాతీయ పతాకాన్ని ఎగురవేసి జిల్లా కలెక్టర్ సెల్యూట్ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణాతో కలిసి మైదానంలో పరేడ్‌ను పరిశీలించారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, అన్ని శాఖల జిల్లాధికారులు, ఉద్యోగులు, పోలీసులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు తదితరులు వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో నంద్యాల జిల్లాకు ఘనచరిత్ర ఉందన్నారు. రేనాటి సూర్యచంద్రులుగా ఖ్యాతి గడించి స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలర్పించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని, కఠినమైన కరువులో ఈ ప్రాంత ప్రజలను ఆదుకున్న అన్నదాత బుడ్డా వెంగళరెడ్డిని అందరూ స్మరించుకోవాలన్నారు.

ఉత్తమ అధికారులకు ప్రశంస

జిల్లా అభివృద్ధిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పంచాయతీరాజ్, వ్యవసాయం, స్త్రీ శిశు సంక్షేమం, కలెక్టరేట్ రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, గణాంక శాఖ, గ్రామ వార్డు సచివాలయాలు, టూరిజం శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ రోలింగ్ షీల్డ్‌లను అందజేశారు. సమాచార పౌర సంబంధాలు, స్త్రీ శిశు సంక్షేమం, ఉద్యాన శాఖ, వ్యవసాయం, డీఆర్‌డీఏ, డ్వామా, వైద్యం ఆరోగ్యం.. తదితర శాఖలు ప్రదర్శించిన ఎగ్జిబిషన్ స్టాళ్లను కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్లు సందర్శించారు. అనంతరం జాతీయ గీతాలాపనతో గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలు ముగిశాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించేలా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శకటాలకు సంబంధించి మొదటి బహుమతి ఏపీఎంఐపీ, హార్టికల్చర్, రెండో బహుమతి స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మూడో బహుమతి డీఆర్డీఏ, విద్యాశాఖ దక్కించుకున్నాయి. ఎగ్జిబిషన్ స్టాళ్లకు సంబంధించి మొదటి బహుమతి హార్టికల్చర్, రెండో బహుమతి స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మూడో బహుమతి డీఆర్డీఏ, డ్వామా శాఖలు పొందాయి.

జిల్లా కలెక్టర్ ప్రసంగంలో ముఖ్యాంశాలు..

- జిల్లా వ్యాప్తంగా 489 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి.. 3,633 విజ్ఞప్తులను రైతుల నుంచి స్వీకరించి.. ఇప్పటివరకు 1,483 అర్జీలను పరిష్కరించామన్నారు.
- గత 12 సంవత్సరాల నుంచి నిషిద్ధ జాబితాలో ఉన్న వివాదాస్పద భూములను పరిష్కరించి 547 మంది భూబాధితులకు చెందిన 96.66 ఎకరాల భూములను పంపిణీ చేశామన్నారు.
- రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలన్నారు.
- రబీలో పంట రుణాల కింద రూ.2,200 కోట్ల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 81,600 మంది రైతులకు రూ.1,500 కోట్ల బ్యాంకుల ద్వారా అందించారన్నారు.
- జిల్లాలో 40 డ్రోన్‌లను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించారని తెలిపారు.
- రబీలో తెలుగుగంగ ప్రధాన కాలువ ద్వారా 84వేల ఎకరాలు, ఎస్సార్బీసీ ద్వారా లక్ష ఎకరాలు, కేసీ కెనాల్ కింద 90 వేల ఎకరాలు, సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 11,150 ఎకరాలు, చిన్ననీటి చెరువుల ద్వారా 7,113 ఎకరాల ఆరుతడి పంటలకు వారాబందీ పద్ధతిన మార్చి నెలాఖరు వరకు సాగునీటిని అందిస్తామన్నారు.
- మినీ గోకులాలు పథకం కింద 850 పశువుల షెడ్లకు గాను 276 మినీ గోకులాల షెడ్లను పూర్తి చేశామన్నారు.
- ఈ ఏడాది ఆర్అండ్‌బీ శాఖతో మిషన్ పాట్ హోల్ ఫ్రీ కింద 10 కోట్ల రూపాయలతో 429 కిలోమీటర్ల రహదారుల్లో గుంతలు పూడ్చే కార్యక్రమం పూర్తి చేసామన్నారు.
- జిల్లాలోని పుణ్యక్షేత్రాలన్నింటినీ 7 టూరిజం సర్క్యూట్లుగా విభజించి వాటి వివరాలతో సైనేజ్ బోర్డులను ఏర్పాటు చేశామన్నారు.
- ప్రకాశం బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకు సీప్లేన్ డెమో విధానాన్ని ఇటీవలే ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు.
- అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద 7,913 ఎకరాలను 915 మంది లబ్ధిదారులకు పట్టాలు జారీ చేశామన్నారు.

శకటాల ప్రదర్శన







ప్రత్యేకంగా అలంకరించిన వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు



స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

శ్రీశైల దేవస్థానానికి రూ.2 లక్షల విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న పలు పథకాలకు పలువురు భక్తులు రూ.2లక్షల విరాళాలను అందించారు. ఆదివారం శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి హైదరాబాద్‌కు చెందిన నందిగం రంజిత్‌కుమార్ రూ.1,01,100 విరాళాన్ని ఏఈవో స్వాములకు అందజేశారు. అలాగే రాజమండ్రికి చెందిన ఎస్.సూర్యప్రకాశరావు ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు టీ.హిమబిందుకు అందజేశారు. విరాళాలు అందించిన దాతలను దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.




దాత రంజిత్ కుమార్‌ను సత్కరిస్తున్న ఏఈవో స్వాములు



ఆహ్లాదం.. చీమలతిప్ప ద్వీపం

చుట్టూ నల్లమల అటవీ ప్రాంతం.. నలువైపులా కృష్ణా జలాలు మధ్యలో ఓ ద్వీపాన్ని తలపించే పచ్చటి చెట్లతో ఆహ్లాదం పంచేలా కనిపించే ఓ కొండ తిప్ప. ఇది ఎక్కడో వేరే రాష్ట్రమో, దేశమో అనుకుంటే పొరపాటే. ఈ ప్రదేశం నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి మండలం నల్లమల అటవీ ప్రాంతంలో కనిపిస్తుంది. కృష్ణా నదిలోని శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువన ఉన్న చీమలతిప్ప ద్వీపం చుట్టూ నీరు, మధ్యలో చిట్టడవిని తలపించేలా ఉండి పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అమరగిరి నుంచి నదిలో అంకాలమ్మ కోట ఆలయానికి వెళ్లే మార్గంలో ఈ ద్వీపం ఉంది. ఇక్కడ 50కి పైగా మత్స్యకార కుటుంబాలు తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నాయి. నదిలో చేపల వేటే వీరి జీవనాధారం. ఈ ద్వీపాన్ని చేరుకోవాలంటే కొత్తపల్లి మీదుగా సింగరాజుపల్లె, ముసలిమడుగు, ఎర్రమఠం, సంగమేశ్వరం నుంచి కృష్ణానదిలో బోటు ప్రయాణం చేయాల్సి ఉంది. ఇది కాకా ముసలిమడుగు గ్రామం పొలిమేర నుంచి నల్లమల అటవీప్రాంతంలో దోవకుంట అటవీశాఖ బేస్ క్యాంపు మీదుగా 7 కి.మీ మేర మోటారు సైకిళ్లపై, ఇతర వాహనాలపై ప్రయాణం చేసి చేరుకోవచ్చు.



- కొత్తపల్లి

పదవుల కోసం పైరవీలు!

- డీసీసీబీ చైర్మన్ పదవిపైనే ఆశలు
- రూ.కోటి వరకు ముడుపులు ఇచ్చేందుకు యత్నాలు
- పీఏసీఎస్‌ల్లో 297 మందికి రానున్న పదవులు
- మార్కెట్ కమిటీల్లో పాలక వర్గాల ఏర్పాటుకు చర్యలు



జిల్లా సహకార కేంద్రబ్యాంకు ప్రధాన కార్యాలయం

కర్నూలు(అగ్రికల్చర్): నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ నాయకులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఈ పదవులపై బీజేపీ, జనసేన నాయకులు కూడా ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పదవి కోసం టీడీపీ నాయకులు పైరవీ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే డీసీసీబీ పాలకవర్గం సభ్యులు కావాలని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ప్రయత్నిస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఈ నెల చివరిలోపు పూర్తికాకున్నాయి. ఈ నేపథ్యంలో 'బేర'రాయబారాలు ఊపందుకున్నాయి.

పీఏసీఎస్‌ల్లో 297 మందికి పదవులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు) ఉన్నాయి. నాన్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలో ఒకరు చైర్మన్‌గా, ఇద్దరు సభ్యులుగా ఉంటారు. పీఏసీఎస్‌ల్లో 297 మంది పదవులు పొందే అవకాశం ఉంది. పదవులు ఇచ్చే అధికారం సంబంధిత ఎమ్మెల్యే, నియోజకవర్గం ఇన్‌చార్జీలకే ఉంటుంది. కొన్ని నియోజకవర్గాల్లో పీఏసీఎస్ చైర్మన్ పదవికి రూ.10 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఆదోని నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీల మధ్య పోటీ ఉన్నట్లు తెలుస్తోంది.

మార్కెట్ కమిటీ చైర్మన్ కావాలని పోటాపోటీ

కర్నూలు జిల్లాలో 7, నంద్యాల జిల్లాలో 8 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇటీవలే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు ఆయా జిల్లా కలెక్టర్లు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ప్రస్తుతం కర్నూలు, ఆదోని, నంద్యాల మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, ఇతర మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ శాఖ ఏడీలు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ఎంపికలో నియోజకవర్గ ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జీలదే అధికారం. దీనిని అవకాశంగా తీసుకొని టీడీపీ నేతలు ముడుపులపై దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు పోటీ ఎక్కువగా ఉంది.

పైరవీలు ఇలా..

ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రూ.4,000 కోట్లకుపైగా టర్నోవర్ ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి కేడీసీసీబీ చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్నారు. కొందరు రూ.కోటి వరకు ముడుపులు ముట్టచెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. డబ్బులు తీసుకుని పదవి ఇస్తే బ్యాంకింగ్ వ్యవహారాల్లో అక్రమాలు వెల్లువెత్తే ప్రమాదం ఉంది. పత్తికొండ నియోజకవర్గం నుంచి సాంబశివారెడ్డి, డోన్ నియోజకవర్గం నుంచి సీమ సుధాకర్‌రెడ్డి, కర్నూలు నుంచి నాగరాజు, కోడుమూరు నుంచి పెరుగు పురుషోత్తమరెడ్డి, ఆదోని నుంచి మీనాక్షి నాయుడు, మంత్రాలయం నుంచి రాఘవేంద్రరెడ్డి, తిక్కారెడ్డి పోటీపడుతున్నారు. కేడీసీసీబీలో చైర్మన్‌గా ఒకరు, డైరెక్టర్లుగా ఉంటారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి ఏడుగురుతో నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ ఏర్పాటు అవుతోంది. డీసీఎంఎస్ పదవులపై ఆసక్తి చూపే వారు తక్కువగా ఉన్నారు.

ఇదీ పరిస్థితి..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉమ్మడి జిల్లా సహకార కేంద్రబ్యాంకుకు జాయింట్ కలెక్టర్ నవ్య, పీఏసీఎస్‌లకు సహకార శాఖ ఉద్యోగులు, వ్యవసాయ మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ శాఖ అధికారులు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీల నియామకంపై ఆశావహులు మంత్రులు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులపై ఒత్తిడి తెస్తున్నారు.

క్లుప్తంగా

రూ.2 వేలతో రూ.40 లక్షల ప్రమాద బీమా

కర్నూలు(అగ్రికల్చర్): భారతీయ స్టేట్‌బ్యాంకు వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని (పీఏఐ) మరింత విస్తరించింది. గరిష్టంగా రూ.20 లక్షల వరకు ఉన్న ప్రమాద బీమాను రూ.40 లక్షలకు పెంచింది. రూ.2000 ప్రీమియంతో రూ.40 లక్షలకు ప్రమాద బీమా కల్పిస్తూ ఎస్‌బీఐ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. రోజుకు రూ.6 ఖర్చుతో రూ.40 లక్షల ప్రమాద బీమా పథకాన్ని పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు ట్రెజరీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ వ్యక్తిగత ప్రమాద బీమాతో రూ.2 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు బీమా లభిస్తుందని చీఫ్ మేనేజర్ స్పష్టం చేశారు. ప్రీమియం రూ.100తో రూ.2 లక్షలు, రూ.200తో రూ.4 లక్షలు ప్రకారం గరిష్టంగా రూ.2 వేల ప్రీమియంతో రూ.40 లక్షల బీమా పొందవచ్చని, ప్రతి రూ.వందకు రూ.2 లక్షల బీమా లభిస్తుందని వివరించారు. రోడ్డు ప్రమాదాలు, కరెంట్‌షాక్, వరదలు, భూకంపం, పాము, తేలు కాటు మరణాలకు ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. 18 నుంచి 70 ఏళ్ల వయసున్న వారెవరైనా బీమా చేయించుకోవచ్చని వెల్లడించారు.

ఏపీలో సినీ పరిశ్రమ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న టీజీ వెంకటేష్

కర్నూలు కల్చరల్: కళలకు పుట్టినిల్లు రాయలసీమ అని, సినిమాలకు ఎక్కువగా ఫైనాన్స్ చేస్తున్నది ఇక్కడి వాసులేనని ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వ్యవస్థాపక చైర్మన్ టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని పరిణయ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థను స్థాపించారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ.. కళలకు రాయలసీమ పుట్టినిల్లు అయినప్పటికీ సినిమా నిర్మాణం, చిత్రీకరణ ఇక్కడ జరగడం లేదన్నారు. ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఈ ప్రాంతంలో సినిమా నిర్మాణం జరగకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రం విడిపోయాక సినీ పరిశ్రమ హైదరాబాద్‌లో ఉండిపోయిందన్నారు. ఇక్కడి వారిని ప్రోత్సహించేలా సినీ పరిశ్రమను ఏపీలో ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అసోసియేషన్ ప్రతినిధులు బీవీ రెడ్డి, కేజే రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, పత్తి ఓబులయ్య, దాశెట్టి శ్రీనివాసులు, మమ్మద్ మియ్యా పాల్గొన్నారు.

చిన్నారిని గుర్తించి తీసుకెళ్లండి



బాలిక పవిత్ర

పత్తికొండ రూరల్: ఈ చిత్రంలో ఉన్న చిన్నారి తప్పిపోయి తమ వద్దకు చేరిందని పత్తికొండ సీఐ జయన్న తెలిపారు. ఆదివారం పందికోన గ్రామంలో చర్చి వద్ద గుర్తు తెలియని బాలిక తిరుగుతుంది. గ్రామస్తులు గుర్తించి ఆరా తీయగా తన పేరు పవిత్ర అని చెప్పింది. తల్లిదండ్రుల పేర్లు, ఊరి పేరు చెప్పలేకపోతోంది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని బాలికను గ్రామపెద్దల సంరక్షణలో ఉంచారు. తల్లిదండ్రులు, బంధువులు ఉంటే పోలీసులను సంప్రదించి బాలికను తీసుకెళ్లాలని కోరారు.

బంజరు భూముల్లోనూ పంటల సాగు సాధ్యమే

కర్నూలు(అగ్రికల్చర్): బంజరు భూముల్లో తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే, వాటిలో ఉత్పాదకతను పెంచుకోవచ్చని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత తెలిపారు. ప్రధానంగా చవుడు నేలలను బాగు చేసుకోవడానికి పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో డీపీపీ పాల్గొని చవుడు నేలలను బాగు చేసుకోవడానికి తగిన సూచనలు ఇచ్చారు. బనవాసి కేవీకే శాస్త్రవేత్త శిరీష, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడారు. వివిధ మండలాల ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం, శ్రీశైలం-518101, నంద్యాల జిల్లా

షార్ట్ టెండరు నోటీస్ - రెండవ పిలుపు

SBMSD-ADMN0ANDM/1/2025-SUPDI(ADNM)-SBMSDSLM, తేది: 26.01.2025

వ.సం.	పనిపేరు
1	శ్రీశైల దేవస్థానము నందు తేది: 19.02.2025 నుండి తేది: 01.03.2025 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు మరియు ఉగాది-2025 మహోత్సవములు అత్యంత వైభవముగా నిర్వహించబడుచున్నవి. కావున దేవస్థానమునకు సంబంధించి వివిధ ప్రదేశములలో అవసరమైన వంట వారిని, వంట పాత్రలు సమకూర్చుకొని దేవస్థానము వారు తెలిపిన ప్రకారము వంట పదార్థములు తయారు చేయవలయును. ఇతర వివరములకు ఫోన్: 9441335756, 9441760724, లను సంప్రదించవలయును. ఇతర వివరముల కొరకు www.apeprocurement.gov.in నందు చూడగలరు.

శ్రీ స్వామి అమ్మవార్ల సేవలో.. సం/- యం.శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం శ్రీశైలం-518101, నంద్యాల జిల్లా. ఆంధ్రప్రదేశ్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన (రెండవ పిలుపు)

ఆర్.సి.నెం. SBMSD-ADMN0TMP/1/2025-TEMP(G2)-SBMSDSLM, తేది: 26.01.2025

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం, శ్రీశైలం, నంద్యాల జిల్లా - ఆలయ విభాగం - ఒక సంవత్సరం కాలపరిమితి అనగా 01.02.2025 నుండి 31.01.2026 వరకు శ్రీశైల మహాక్షేత్రము నందు నిర్వహించబడు వివిధ పర్వదినములలో శ్రీ స్వామి అమ్మ వార్లకు నిర్వహించు గ్రామోత్సవ వాహనములను మోయుటకు అవసరమైన పనివార్లని మరియు ఆలయము నందు పారిశుధ్య పనులు చేపట్టుటకు తాత్కాలికముగా సరఫరా చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు కోరబడుచున్నది. ఇతర వివరముల కొరకు www.apeprocurement.ap.gov.in నందు చూడవచ్చును.

శ్రీ స్వామి అమ్మవార్ల సేవలో.. సం/- యం.శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి



శ్రీనివాస్, డోన్ డీఎస్పీ



రామాంజినాయక్, ఆత్మకూరు డీఎస్పీ



మోహన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్



సుధాకర్ రెడ్డి, నంద్యాల వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్



కృష్ణయ్య, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్



సురేష్ కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్



రాము, ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్



నగీన, ఆళ్లగడ్డ టౌన్ ఎస్ఐ



సుబ్బారెడ్డి, ఏఎస్ఐ



మమత, డోన్ ఎస్ఐ



దస్తగిరి, కానిస్టేబుల్

ఉత్తమ సేవలకు ప్రశంసలు



జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేశారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణు చరణ్ - నంద్యాల



గురుప్రసాద్, కానిస్టేబుల్



ఓబుల్ రెడ్డి, కానిస్టేబుల్



సురేష్, ఎస్ఐ



శివకుమారి, కానిస్టేబుల్



కాళీ చరణ్, ఆర్ఎస్ఐ



జగన్ మోహన్, బండిఆత్మకూర్ ఎస్ఐ



బాషా, ఏఎస్ఐ



జిలాన్ బాషా, కానిస్టేబుల్



గంగారావు, సీసీ కానిస్టేబుల్



అమీర్ బాషా, వన్‌టౌన్ కానిస్టేబుల్



నాగరాజు, ఎస్పీసీసీ, నంద్యాల



రామచంద్ర, ఏఎస్ఐ, నందికొట్కూరు



సజ్జద్ అలీ, కానిస్టేబుల్, నంద్యాల



రామచంద్రారెడ్డి, హెడ్ వార్డర్, నందికొట్కూరు

కిందిస్థాయి ఉద్యోగులకు దక్కని ప్రశంస

నంద్యాల: ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా రెవెన్యూ, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అంగన్‌వాడీ, వైద్యం, అగ్రికల్చర్ శాఖల్లో పనిచేస్తూ ప్రతిభ కనబరిచే ఉద్యోగులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేసేవారు. అయితే ఈ ఏడాది కిందిస్థాయి ఉద్యోగులకు ఎవరికీ అవార్డులు ఇవ్వకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. మొట్టమొదటి సారి కిందిస్థాయి ఉద్యోగులకు అవార్డులు రాకపోవడం చర్చనీయాంశమైంది. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి నిర్ణయం మేరకే కొందరు ఉద్యోగులకు అవార్డులు ఇవ్వలేదని తెలుస్తోంది. జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా తమ శాఖలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డుల కోసం పేర్లు పంపడంతో వారందరికీ అవార్డులు, ప్రశంసా పత్రాలు దక్కాయి. అయితే పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ, రెవెన్యూ, టూరిజం, ఎక్సైజ్ శాఖ, ఐసీడీఎస్, వైద్యం, సీపీఓ, జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖలకు గ్రూపులుగా అవార్డులు అందజేశారు.



ఎల్లయ్య, సబ్‌జైల్ వార్డర్, నంద్యాల

హరిప్రసాద్, సబ్‌జైల్ వార్డర్, ఆళ్లగడ్డ

కేసీ వెంకటసుబ్బన్న, హెడ్‌వార్డర్, ఆళ్లగడ్డ

ప్రసాదరెడ్డి, సబ్‌జైల్ వార్డర్, బనగానపల్లె



కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా షీల్డ్ అందుకుంటున్న సచివాలయ అధికారులు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ఏపీ టూరిజం శాఖ అధికారులు



పంచాయతీ రాజ్ శాఖ అధికారులు



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు

గుంతలో పడిన గోమాత



కొలిమిగుండ్ల: కల్వటాల ప్రధాన రహదారి పక్కనున్న గుంతలో ఆదివారం గోమాత పడి విలవిలలాడింది. అవుకు రిజర్వాయర్ నుంచి గ్రామాలకు తాగునీరు సరఫరా అందించే పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో ఇటీవల గుంత తీశారు. అందులో నీరు నిల్వ చేరాయి. ఆవు మేత మేస్తూ రోడ్డు పక్కనున్న నాలుగైదు అడుగుల లోతున్న గుంతలో పడిపోయింది. బయటకు వచ్చేందుకు శతవిధాలా ప్రయత్నం చేసినా రాలేక అందులోనే ఉండిపోయింది. కాసేపటి తర్వాత స్థానికులు గమనించి తాళ్ల సాయంతో గోవును బయటకు లాగారు. రోడ్డుకు మూడు అడుగుల దూరంలో గుంత ఉండటంతో ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ మార్గంలో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, అధికారులు చర్యలు తీసుకొని గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

ఎలుగుబంటిని చూసి వాహనదారుల బెంబేలు

- బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: బైక్‌పై వెళుతుండగా అకస్మాత్తుగా ఎలుగుబంటి కనిపించడంతో భయాందోళనకు గురై బైక్‌పై నియంత్రణ కోల్పోవడంతో కిందపడి ముగ్గురు యువకులు గాయాలపాలయ్యారు. వివరాలు.. సుండిపెంట రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన యువకులు రామునాయక్, చందూనాయక్, హరియానాయక్ శ్రీశైలంలో యాత్రికుల వాహనాలను శుభ్రం చేసి, బొమ్మలు వేసే పని చేసేవారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 5:30 గంటలకు ఏపీ 40 ఏవై 0067 నంబరుగల బైక్‌పై శ్రీశైలం వెళుతుండగా ఈద్గా సమీప మలుపు వద్ద అకస్మాత్తుగా ఎలుగుబంటి రోడ్డు దాటుతూ కనిపించింది. భయాందోళనకు గురై సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి కింద పడిపోవడంతో స్వల్పంగా గాయపడ్డారు. కింద పడ్డ తమపై ఎలుగుబంటి దాడి చేసేందుకు దగ్గరకు వస్తున్న సమయంలో అటుగా బస్సు రావడంతో అడవిలోకి వెళ్లిపోయిందని తెలిపారు.

వసంత పంచమికి ఏర్పాట్లు

కొత్తపల్లి: ఫిబ్రవరి 2న మండలంలోని శివపురం గ్రామం సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఏకైక సరస్వతి క్షేత్రమైన కొలనుభారతి దేవి అమ్మవారి పుట్టిన రోజు, వసంత పంచమి వేడుకలు దేవదాయ శాఖ వారు నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా శివపురం సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి అజ్మతున్నీసా ఆదివారం పనులు ప్రారంభించారు. కొలనులోని బురద తొలగింపు, ఆలయ ప్రాంగణానికి పందిళ్లు వేసేందుకు, వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం, నీటి ట్యాంకులను శుభ్రం చేయడం వంటి పనులు మొదలు పెట్టారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రామలింగారెడ్డితో కలిసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



చారుఘోషిని నదిలో పూడిక తీస్తున్న దృశ్యం

విద్యార్థుల సందడి

ఆదివారం కావడంతో కొలనుభారతి క్షేత్రంలో విద్యార్థులు సందడి చేశారు. కర్నూలు మాస్టర్స్ కళాశాల విద్యార్థినులు ఆలయాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకున్నారు.

కల్లం దాటని ఎర్ర బంగారం

ఎర్ర బంగారంగా పేరుగాంచిన మిర్చి సాగు.. అన్నదాతలకు రెండేళ్లుగా కలిసిరావడం లేదు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో నష్టపోయిన రైతన్నలకు ఈ ఏడాది కూడా అవే నష్టాలే మిగిలాయి. బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు తదితర సాగునీటి వనరుల ఆధారంగా నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 21 వేల ఎకరాల్లో రైతులు మిర్చిని సాగు చేశారు. ఒక్కో ఎకరాకు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. దిగుబడులు పూర్తిగా తగ్గడం.. మార్కెట్లో ధరలు అంతంత మాత్రమే ఉండటంతో పెట్టుబడులు కూడా చేతికి అందేలా లేవని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

– కోవెలకుంట్ల/బనగానపల్లె

- అన్నదాతకు కలిసి రాని మిరప సాగు
- ఎకరాకు 20 క్వింటాళ్లలోపే దిగుబడులు
- మార్కెట్‌లో క్వింటా రూ.15 వేలు
- ఆందోళనలో రైతులు

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 21 వేల ఎకరాల్లో మిర్చి సాగైంది. అత్యధికంగా సంజామల మండలంలో 2,859 ఎకరాల్లో సాగైంది. పాణ్యం 2,075, కోవెలకుంట్ల 1,986, అవుకు 1,749, నంద్యాల 1,628, బనగానపల్లె 1,532, మిడుతూరు 1,408, గోస్పాడు 1,052 ఎకరాల చొప్పున రైతులు మిర్చి సాగు చేశారు. సకాలంలో సాగు నీటి వనరులు అందుబాటులో లేకపోవడం, గతేడాది మిరప సాగులో దిగుబడులు తగ్గడంతో ఈ ఏడాది మిర్చి సాగు తగ్గింది. కాగా ఎన్నో ఆశలతో సాగు చేసిన రైతులను మాత్రం మిరప నష్టాల ఊబిలోకి నెట్టింది. నార, నాట్లు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, సాగునీరు మళ్లింపు తదితర పెట్టుబడుల రూపంలో రైతులు ఎకరాకు రూ.2 లక్షలకు పైగా వెచ్చించారు. కౌలు రైతులకు రూ. 50 వేలు అదనపు భారం పడింది. గతేడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో మిరపను తెగుళ్లు ఆశించి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎకరాకు 20 క్వింటాళ్లకు మించి రాకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు చవి చూడాల్సి వచ్చింది. ధర కూడా ప్రస్తుత మార్కెట్‌లో క్వింటా రూ.15 వేలకు మించి పలకకపోవడంతో కనీసం పెట్టుబడులు కూడా రావని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి వద్ద కల్లంలో ఆరబోసిన మిరప

పెరిగిన పెట్టుబడి



ఎకరాకు రూ.30 వేలు కౌలు చెల్లించి ఎనిమిది ఎకరాల్లో మిరప సాగు చేశాను. తుపాన్ ప్రభావంతో అధిక వర్షాలతో తెగుళ్లసోకి దిగుబడులు గణనీయంగా తగ్గాయి, తెగుళ్ల బారి నుంచి పైరును కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎకరాకు 20 క్వింటాళ్లకు మించి దిగుబడులు రాకపోవడంతో మిరప సాగుతో నష్టాలు చవి చూడాల్సి వచ్చింది.

– మద్దిలేటి,రైతు, వల్లంపాడు,కోవెలకుంట్ల మండలం

మిర్చి తొలగించి మినుము వేశాను



నేను 10 ఎకరాల్లో మిర్చి పంటసాగు చేశాను. వాతావరణ పరిస్థితుల కారణంగా పైరు పెరగకపోవడంతో ఆరు ఎకరాల్లో పంటను తొలగించి మినుము పంట వేశాను. మినుమును కూడా తెగుళ్లు ఆశించడంతో పాడై పోయింది. ఇప్పటికే రూ.3 లక్షల వరకు నష్టం వచ్చింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.– కాటసాని రామక్రిష్టారెడ్డి, మిర్చి రైతు, మిట్టపల్లి, బనగానపల్లె మండలం

పెట్టుబడులు కూడా రావు



ఎకర రూ.30 వేల చొప్పున పది ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాను. ఇంత వరకు పంటకు రసాయన మందులు, కూలీలు కోసం ఎకరాకు రూ.2.30 లక్షల వరకు ఖర్చు చేశాను. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదు. ఈ లెక్కన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితిలేదు.

– ప్రతాప్‌రెడ్డి, మిర్చి కౌలు రైతు కైప గ్రామం

మోదీకి రైతులే బుద్ధి చెబుతారు

కర్నూలు(సెంట్రల్): రైతులను మోసం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి వచ్చే ఎన్నికల్లో వారే తగిన బుద్ధి చెబుతారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్ప, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ స్పష్టం చేశారు. మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసిన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మోదీ విఫలమయ్యారన్నారు. ఆదివారం అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సంఘాలు ట్రాక్టర్లు, ఆటోలు, స్కూటర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కేంద్రంలో చలనం లేదన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని చెప్పిన మోదీ పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తున్నా సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. రైతు సంఘాల నాయకులు ఎండీ ఆనంద్ బాబు, బి.నాగన్న, పోతుల శేఖర్, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి పాల్గొన్నారు.

30న 'పోతు గడ్డ' చిత్రం విడుదల

కర్నూలు కల్చరల్: 24 సినిమా స్ట్రీట్ ప్రొడక్షన్‌లో నిర్మించిన ఫ్యాక్షన్, ప్రేమ కథా చిత్రం 'పోతు గడ్డ' అని చిత్ర దర్శకుడు రక్ష వీరం చెప్పారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సినిమా విడుదల తేదీని చిత్ర యూనిట్ ప్రకటించింది. దర్శకుడు మాట్లాడుతూ.. పరువు గొప్పదా?, ప్రేమ గొప్పదా? అన్న నేపథ్యంలో సినిమా సాగుతుందన్నారు. ఈ నెల 30వ తేదీన ఓటీటీ ప్లాట్‌ఫాంపై సినిమాను విడుదల చేస్తున్నామన్నారు. హీరో హీరోయిన్లు పృథ్వీ దండమూడి, విష్మయ శ్రీ మాట్లాడుతూ.. ప్రేక్షకులకు మంచి అనుభూతిని మిగిల్చేలా చిత్రం ఉంటుందన్నారు. చిత్రాన్ని ఆదరించి ప్రోత్సహించాలని విన్నవించారు. మాటల రచయిత కెంగార మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నటులు నరేష్, శత్రు, ప్రశాంత్ కార్తీ, వెంకీ లింగం, తదితరులు పాల్గొన్నారు.

చిత్ర బృందానికి సన్మానం

పోతుగడ్డ సినిమా యూనిట్ సభ్యులను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళాకారులు సన్మానించి జ్ఞాపికలను బహుకరించారు. వారు మాట్లాడుతూ.. సీమ యాసను ప్రతిబింబిస్తూ సినిమా మొత్తం సాగడం అభినందనీయమన్నారు.

భారత ఫుట్‌బాల్ జట్టు సెలెక్టర్‌గా కర్నూలు వాసి

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని పాతబస్తీకి చెందిన సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, 6 సార్లు సంతోష్ ట్రోఫీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన షేక్ ఖలీల్ రెహమాన్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ అండర్- 17 యూత్ లీగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఇండియన్ టీమ్‌కు సెలెక్టర్‌గా ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి.అనిల్‌కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. న్యూఢిల్లీ వేదికగా జరిగే అండర్-17 యూత్ లీగ్ పోటీల్లో జట్టును ఎంపిక చేసే బాధ్యతలు ఆయనకు అప్పగించారు. ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆల్ ఇండియా జట్టు ప్రాబబుల్స్ నిర్వహించనున్నారు.

జీసీజీటీఏ నూతన జిల్లా అధ్యక్షుడిగా వెంకటస్వామి



ప్రమాణ స్వీకారం చేస్తున్న జీసీజీటీఏ నూతన కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: గవర్నమెంట్ కాలేజ్ గజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీజీటీఏ) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా కల్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.వి. శేషయ్య వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా కర్నూలు పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎ.వెంకటస్వామి, కార్యదర్శిగా సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ మహమ్మద్ వాయిజ్, ఉపాధ్యక్షులుగా కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎం.సి. సాహిత్య, కోశాధికారిగా సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ నాగన్న, సంయుక్త కార్యదర్శిగా పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ టి.మాదన్నను ఎంపిక చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COACHING

■ రైల్వే గ్రూప్-D (RRB) ఉద్యోగాలకు కోచింగ్ అర్హత: 10th Pass, Ranker's అకాడమి Door 37, 4th floor, Skanda Shoping Mall, పాతచాంద్ టాకీస్ దగ్గర, పాతబస్టాండ్, కర్నూలు. Cell:9494743392, 9014268009. [L-794722]

REAL ESTATE

PLOT FOR SALE

■ కర్నూలు-నంద్యాల రోడ్, ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్ ఏరియాలో రోజురోజుకు కొత్త రూపం దాల్చుతున్న ఓర్వకల్లు ఏరియాలో 1 సెంటు 75,000/- మాత్రమే. 9963800314 [L-794759]

HOUSE FOR SALE

■ కర్నూలు టౌన్, డోన్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర, స్కంద హిల్స్ కాలనీలో తూర్పుఫేస్ 2BHK ఇండిపెండెంట్ హౌస్ ఉడ్ వర్క్ & బోరు సౌకర్యాలతో అమ్మబడును. ✆ 83175 04148. [L-794719]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6650]

WANTED

■ కర్నూలులోని ప్రముఖ హాస్పిటల్ నందు వర్క్ చేయుటకు డ్యూటీ డాక్టర్స్ కావలెను. (BHMS/BJMS) & కంప్యూటర్ పరిజ్ఞానం, డిగ్రీ అర్హత గల రిసెప్షనిస్ట్ కావలెను. ✆ 94914 91911. [L-572]

■ AP TS NEWS APP: లేడీ టెలికాలర్స్, టీం లీడర్స్ కావలెను. జీతం: 10వేల నుండి 30వేల వరకు. సంప్ర॥ 2nd ఫ్లోర్, షాపి నెం: 223, జగదీష్ మాల్, బిర్లా గేట్, కర్నూలు. సెల్: 94403 84846. [L-794718]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు,ఆయా,నర్సులు,వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు - 40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD. 9666253675 [HA-99631]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పార్ట్ టైమ్ పని చేస్తూ లక్షలు సంపాదించే అవకాశం. రిటైర్డ్ ఉద్యోగస్తులకు మంచి అవకాశం. ✆ 7702805174 [SCA25001309]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతిఫుడ్ జీ:20k ఫోన్: 8977639662, 8977639663 [SCA25001369]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.